వైభవంగా యాదగిరీశుడి తిరు కల్యాణోత్సవం

స్పటిక లింగేశ్వరుడికి రుద్రాభిషేకం నిర్వహిస్తున్న పురోహితుడు

యాదగిరిగుట్ట, జూలై 8 : యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామివారి ప్రధానాలయంలో స్వామి, అమ్మవార్ల నిత్య తిరుకల్యాణోత్సవం అత్యంత వైభవంగా సాగింది. సోమవారం ఉదయం వెలుపలి ప్రాకార మండపంలో సుదర్శన నారసింహ హోమం జరిపిన అర్చకులు ఉత్సవమూర్తులను దివ్య మనోహరంగా అలంకరించి గజ వాహనంపై వేంచేపు చేసి కల్యాణోత్సవ సేవను జరిపారు. కల్యాణ మండపంలో స్వామి, అమ్మవార్లను వేంచేపు చేసి కల్యాణ తంతు చేపట్టారు. లక్ష్మీ సమేతుడైన నారసింహుడిని ఆరాధిస్తూ సుమారు గంటన్నరకు పైగా నిత్య తిరు కల్యాణ తంతును జరిపారు. తెల్లవారుజామునే ఆలయాన్ని తెరిచిన అర్చకులు సుప్రభాతంతో స్వామివారిని మేల్కొలిపారు. అనంతరం తిరువారాధన జరిపి, ఉదయం ఆరగింపు చేపట్టారు. స్వయంభూ ప్రధానాలయంలో స్వామి, అమ్మవార్లకు నిజాభిషేకం జరిపారు. స్వామివారికి తులసీ సహస్రనామార్చన, అమ్మవారికి కుంకుమార్చన, ఆంజనేయస్వామికి సహస్రనామార్చన చేపట్టి భక్తులకు స్వామి, అమ్మవార్ల దర్శన భాగ్యం కల్పించారు. ప్రధానాలయం ముఖ మండపంలో స్వామివారికి ఉదయం నుంచి సాయంత్రం వరకు పలు దఫాలుగా భక్తులతో సువర్ణ పుష్పార్చన జరిపించారు. బంగారు పుష్పాలతో దేవేరులకు అర్చన చేశారు. సాయంత్రం స్వామివారికి తిరువీధి సేవ, దర్బార్ సేవ అత్యంత వైభవంగా చేపట్టారు. పాతగుట్ట స్వామివారికి నిత్యారాధనలు అత్యంత వైభవంగా సాగాయి. అనుబంధ రామలింగేశ్వరస్వామి ప్రధానాలయంలో పరమశివుడు, స్పటిక లింగేశ్వరుడికి మహన్యాస పూర్వక రుద్రాభిషేకం అత్యంత వైభవంగా సాగింది. ఉదయం నుంచి సాయంత్రం వరకు దర్శనాలు కొనసాగాయి. సుమారు 8వేల మంది భక్తులు స్వామివారిని దర్శించుకున్నట్లు ఆలయ అధికారులు వెల్లడించారు. స్వామివారి ఖజానాకు . రూ.19,35,743 ఆదాయం సమకూరిందని ఆలయ అనువంశిక ధర్మకర్త బి.నరసింహమూర్తి, ఈఓ భాస్కర్‌రావు తెలిపారు.

స్వామివారిని దర్శించుకున్న సినీ నటి మంచు లక్ష్మి

యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామిని సినీ నటి మంచు లక్ష్మి దర్శించుకున్నారు. సోమవారం యాదగిరి కొండకు చేరుకున్న ఆమె స్వయంభూ పంచనారసింహస్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమెకు ఆలయ అర్చకులు ఆశీర్వచనం చేయగా.. ఆలయ ఈఓ భాస్కర్‌రావు స్వామివారి ప్రసాదాన్ని అందజేశారు.

ప్రజావాణి సమస్యలను త్వరగా పరిష్కరించాలి

- అదనపు కలెక్టర్లు బెన్‌షాలోమ్, గంగాధర్

ప్రజావాణిలో ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరిస్తున్న అధికారులు

భువనగిరి కలెక్టరేట్, జూలై 8 : ప్రజావాణి సమస్యలను త్వరగా పరిష్కరించాలని అదనపు కలెక్టర్లు పి.బెన్‌షాలోమ్, కె.గంగాధర్ అధికారులకు సూచించారు. కలెక్టర్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన అర్జీదారుల వినతి పత్రాలను స్వీకరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజా సమస్యలపై అలసత్వం వహిస్తే కఠిన చర్యలుంటాయన్నారు. ప్రజల నుంచి 59 దరఖాస్తులు వచ్చాయని, అందులో రెవెన్యూ శాఖకు 39, గ్రామీణాభివృద్ధి – 5, విద్యాశాఖ – 4, సర్వే ల్యాండ్ రికార్డు – 2, అటవీ శాఖ – 2, విద్యుత్ శాఖ –2, పోలీసు, పంచాయతీ శాఖ, ఆర్‌డబ్ల్యూఎస్, లీడ్ బ్యాంక్ మేనేజర్, మున్సిపాలిటీ శాఖకు ఒక్కొక్కటి చొప్పున వచ్చాయని తెలిపారు. కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు, అర్జీదారులు పాల్గొన్నారు.

సదరన్ క్యాంపు స్లాట్ బుకింగ్ ప్రక్రియ ప్రారంభించాలని వినతి

సదరన్ సర్టిఫికెట్ కాల వ్యవధి పూర్తయిన, కొత్తగా పెన్షన్ల కోసం దరఖాస్తు చేసుకొనే దివ్యాంగుల సదరన్ క్యాంపు స్లాట్ బుకింగ్ ప్రక్రియ వెంటనే ప్రారంభించాలని వికలాంగుల హక్కుల పోరాట సమితి (వీహెచ్‌పీఎస్) ఆధ్వర్యంలో సోమవారం ప్రజావాణిలో వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వీహెచ్‌పీఎస్ జిల్లా అధ్యక్షుడు ధరణికోట నర్సింహ మాట్లాడుతూ కలెక్టర్ వెంటనే చర్యలు తీసుకొని సదరన్ క్యాంపు స్లాట్ బుకింగ్ కోసం ఆదేశాలు జారీ చేయాలని కోరారు. వినతి పత్రం ఇచ్చిన వారిలో వీహెచ్‌పీఎస్ జిల్లా నాయకులు జాగిల్లాపురం అయిలయ్య, మచ్చ ఉపేందర్, సింగారం రమేశ్, అనంతుల ఎల్లారెడ్డి పాల్గొన్నారు.

'గ్రామీణ వైద్యులపై దాడులను ఆపాలి'

ఎమ్మెల్యే అనిల్‌కుమార్‌రెడ్డికి వినతి పత్రం ఇస్తున్న గ్రామీణ వైదులు

భువనగిరి అర్బన్, జూలై 8 : గ్రామీణ వైద్యులపై జరుగుతున్న దాడులను ఆపి తమ సమస్యను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లాలని గ్రామీణ వైద్యుల సంఘం నాయకులు కోరారు. ఈ మేరకు సోమవారం ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వైఎస్ఆర్ ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో 2009లో తమ సమస్యను గుర్తించి పారామెడికల్ బోర్డులో వెయ్యి గంటల శిక్షణ ఇచ్చారని తెలిపారు. కానీ.. ఎలాంటి సర్టిఫికెట్ ఇవ్వలేదన్నారు. ఇదే వృత్తిని నమ్ముకుని బతుకుతున్న తమ సమస్యలను పరిష్కరించే విధంగా చూడాలని కోరారు. వినతి పత్రం ఇచ్చిన వారిలో జిల్లా గ్రామీణ వైద్యుల సంఘం జిల్లా అధ్యక్షుడు కొండ సోమయ్య, గ్రామీణ వైద్యులు పాల్గొన్నారు.

ఎల్ఓసీ అందజేత

ఎల్ఓసీ అందజేస్తున్న ఎమ్మెల్యే

రామన్నపేట (వలిగొండ), జూలై 8 : మండల కేంద్రానికి చెందిన ఎదురుగట్ల నర్సమ్మకు వైద్య సహాయం కోసం ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి మంజూరైన 1,50,000 రూపాయల ఎల్ఓసీని ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి ఆమె కుటుంబ సభ్యులకు భువనగిరి క్యాంపు కార్యాలయంలో సోమవారం అందజేశారు. మాజీ ఎంపీపీ నూతి రమేశ్, నాయకులు శ్రీనివాస్, రవి, కిష్టయ్య, లింగస్వామి, భాస్కర్ పాల్గొన్నారు.

కల్లుగీత కార్మికులకు ఇచ్చిన హామీలు అమలు చేయాలి

సమావేశంలో మాట్లాడుతున్న కల్లుగీత కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వెంకటరమణ

భువనగిరి అర్బన్, జూలై 8 : కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ముందు కల్లుగీత కార్మికులకు ఇచ్చిన హామీలు అమలు చేయాలని తెలంగాణ కల్లుగీత కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మేకపోతుల వెంకటరమణ అన్నారు. పట్టణంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో సోమవారం గీత కార్మికులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గీత కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని, కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలు అమలు చేయాలని మంత్రులు జూపల్లి కృష్ణారావు, పొన్నం ప్రభాకర్‌కు రెండుసార్లు కలిసినా ఎలాంటి పురోగతి లేదన్నారు. గీత కార్మికులు ఇప్పటికే 520 మంది ప్రమాదానికి గురయ్యారని, అందులో 76 మంది చనిపోయారని తెలిపారు. ప్రమాదాల నివారణకు ప్రభుత్వం ఎలాంటి చర్యలూ చేపట్టడం లేదని విమర్శించారు. తాడి కార్పొరేషన్ ఆధ్వర్యంలో ప్రిన్సిపల్ సెక్రటరీ బుర్రా వెంకటేశం చొరవతో సేఫ్టీ రోప్ ఇచ్చి గీత కార్మికులకు ప్రాణ రక్షణ కల్పించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో సంఘం జిల్లా నాయకులు మాటూరు బాలరాజు, దూపటి వెంకటేశ్, బత్తిని భిక్షం, అంతటి అశోక్, గాజుల ఆంజనేయులు, నరసింహ, మైసయ్య, బాలరాజు. ఈశ్వర్, భిక్షం పాల్గొన్నారు.

ఆత్మకూరు(ఎం) ఎస్ఐగా కృష్ణయ్య బాధ్యతలు

ఎస్ఐ కృష్ణయ్య

ఆత్మకూరు(ఎం), జూలై 8 : ఆత్మకూరు(ఎం) ఎస్ఐగా బదిలీపై వచ్చిన కృష్ణయ్య సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ ఎస్ఐగా విధులు నిర్వహించిన డి.నాగరాజు రంగారెడ్డి జిల్లా బాలాపూర్ ఎస్ఐగా బదిలీపై వెళ్లారు. ఆయన స్థానంలో చౌటుప్పల్ ట్రాఫిక్ ఎస్ఐ కృష్ణయ్య ఇక్కడికి బదిలీపై వచ్చారు.

రాజాపేట ఎస్ఐగా ఉపేందర్..

రాజాపేట ఎస్ఐగా బాధ్యతలు స్వీకరిస్తున్న ఉపేందర్

రాజాపేట : కుశాయిగూడ పోలీస్ స్టేషన్ నుంచి బదిలీపై వచ్చిన ఉపేందర్ యాదవ్ సోమవారం రాజాపేట ఎస్ఐగా బాధ్యతలు చేపట్టారు. గతంలో ఇక్కడ పనిచేసిన సుధాకర్‌రెడ్డి కుశాయిగూడ పోలీస్ స్టేషన్‌కు బదిలీపై వెళ్లారు. కొత్తగా బాధ్యతలు చేపట్టిన ఎస్ఐ ఉపేందర్‌యాదవ్‌ను పోలీసులు, ప్రజాప్రతినిధులు సన్మానించారు. ఎస్ఐ సుధాకర్‌రెడ్డికి వీడ్కోలు పలికారు.

పట్టణ అభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తా : మున్సిపల్ చైర్మన్ రాజు

డ్రైనేజీ పనులకు శంకుస్థాపన చేస్తున్న మున్సిపల్ చైర్మన్ రాజు

చౌటుప్పల్, జూలై 8 : పట్టణ అభివృద్ధే లక్ష్యంగా పని చేస్తానని మున్సిపల్ చైర్మన్ వెన్‌రెడ్డి రాజు అన్నారు. పట్టణంలోని 13వ వార్డులో సీసీ రోడ్డు, డ్రైనేజీ నిర్మాణానికి సోమవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వార్డుల్లో ఎలాంటి సమస్యలున్నా తన దృష్టికి తేవాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ బత్తుల శ్రీశైలం, కౌన్సిలర్ సుల్తాన్ రాజు, నాయకులు తాడూరి పరమేశ్, తొర్పునూరి రవి గౌడ్, అనమోని గోవిందు రాజు పాల్గొన్నారు.

మహిళలు స్వయం ఉపాధిలో రాణించాలి

మహిళలు స్వయం ఉపాధిలో రాణించాలని మున్సిపల్ చైర్మన్ వెన్‌రెడ్డి రాజు అన్నారు. పట్టణంలోని 11, 12వ వార్డుల్లో మదర్ ఎడ్యుకేషన్ అండ్ రూరల్ డెవలప్‌మెంట్ సొసైటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత టైలరింగ్ శిక్షణ కేంద్రాన్ని సోమవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఉచిత టైలరింగ్ శిక్షణను స్థానిక మహిళలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో సొసైటీ చైర్మన్ బొజ్జ సంధ్యారాణి, నాయకులు తాడూరి పరమేశ్, మహిళలు పాల్గొన్నారు.

ఆధ్యాత్మికతతోనే మోక్ష ప్రాప్తి : జ్ఞాన చైతన్యానంద స్వామీజీ

భక్తులను ఉద్దేశించి ప్రసంగిస్తున్న జ్ఞాన చైతన్యానంద స్వామీజీ

భూదాన్ పోచంపల్లి, జూలై 8 : ఆధ్యాత్మికతతోనే మోక్ష ప్రాప్తి లభిస్తుందని బ్రహ్మశ్రీ జ్ఞాన చైతన్యానంద స్వామీజీ అన్నారు. పట్టణంలోని మార్కండేశ్వరస్వామి దేవాలయం ఆవరణలో ఆధ్యాత్మిక జ్ఞాన సత్సంగం ఆధ్వర్యంలో భగవద్గీతలోని పురుషోత్తమ ప్రాప్తి యోగంపై సోమవారం స్వామీజీ ఉపన్యసించారు. మానవ జన్మను సార్థకం చేసుకోవాలని, పరులకు మేలు చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఆధ్యాత్మిక జ్ఞాన సత్సంగం అధ్యక్షుడు బల్ల దుర్వాసులు, ఉపాధ్యక్షుడు సకినాల నాగయ్య, ప్రధాన కార్యదర్శి గుర్రం కృష్ణ , వ్యవస్థాపక అధ్యక్షుడు రుద్ర పాండురంగం శాస్త్రి, ప్రతినిధులు శ్రీరాములు, ఆంజనేయులు, నరహరి, వెంకటేశ్, కృష్ణానంద, నాగేశ్వర్, నర్సింహ, నరేందర్, లక్ష్మయ్య, ప్రసాద్, బాలకృష్ణ, అక్షయ్ కృష్ణ, భక్తులు పాల్గొన్నారు.

డబుల్ బెడ్రూమ్ ఇండ్ల వద్ద మౌలిక వసతులు కల్పించాలి : సీపీఎం

ఆర్ఐ మల్లికార్జున్‌రావుకు వినతిపత్రం ఇస్తున్న సీపీఎం నాయకులు, లబ్ధిదారులు

ఆత్మకూరు(ఎం), జూలై 8 : మండల కేంద్రంలో నిర్మించిన డబుల్ బెడ్రూమ్ ఇండ్ల వద్ద డ్రైనేజీ, సీసీ రోడ్ల ఏర్పాటుతోపాటు మౌలిక వసతులు కల్పించాలని సీపీఎం ఆధ్వర్యంలో సోమవారం లబ్ధిదారులు ధర్నా నిర్వహించారు. అనంతరం ఆర్ఐ మల్లికార్జున్‌రావుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీపీఎం మండల కార్యదర్శి వేముల భిక్షం మాట్లాడుతూ బీఆర్ఎస్ ప్రభుత్వం అర్హులైన పేదలకు డబుల్ బెడ్రూమ్ ఇండ్లు నిర్మించి పంపిణీ చేసిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వాటి వద్ద డ్రైనేజీ, సీసీ రోడ్లతో పాటు మౌలిక వసతులు కల్పించాలని కోరారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు రచ్చ గోవర్ధన్, తుమ్మల సత్యనారాయణరెడ్డి, లబ్ధిదారులు పాల్గొన్నారు.

ఎన్నికల హామీని అమలు చేయాలి : అఖిలపక్షం

సమావేశంలో మాట్లాడుతున్న అఖిలపక్ష కమిటీ కన్వీనర్ వీరేశం

ఆలేరు రూరల్, జూలై 8 : అసెంబ్లీ ఎన్నికల సమయంలో ఆలేరును రెవెన్యూ డివిజన్‌గా ఏర్పాటు చేస్తామని కాంగ్రెస్ మ్యానిఫెస్టోలో ప్రకటించారని, 9నెలలు అయినా అమలు కావడం లేదని అఖిలపక్ష కమిటీ కన్వీనర్ పసుపునూరి వీరేశం అన్నారు. ఆలేరులో సోమవారం ఏర్పాటు చేసిన అఖిలపక్ష కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆలేరు అభివృద్ధి జరుగాలంటే రెవెన్యూ డివిజన్ ఏర్పాటైతే తప్ప.. వేరే అవకాశం లేదన్నారు. ఎమ్మెల్యే ఇచ్చిన మాట ప్రకారం త్వరలో రెవెన్యూ డివిజన్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో అఖిలపక్ష నాయకులు రాజకొండ జనార్దన్, ఎండీ సలీమ్, చెక్క వెంకటేశ్, మొరిగాడి చంద్రశేఖర్ పాల్గొన్నారు.

భవనం పైనుంచి పడి తాపీమేస్త్రీ మృతి

బీబీనగర్, జూలై 8 : ప్రమాదవశాత్తు భవనం పైనుంచి జారిపడి తాపీమేస్త్రీ మృతి చెందాడు. ఎస్ఐ ఎన్.రమేశ్ తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన సుంకరి లింగారెడ్డి మండల కేంద్రంలో నూతన భవనాన్ని నిర్మిస్తున్నాడు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం బాపట్ల జిల్లా అద్దంకి మండలం దేనువుకొండ గ్రామానికి చెందిన గుంజి వెంకటేశ్వర్లు (28) ఇక్కడ కొన్ని నెలలుగా నిర్మాణ పనులు చేపడుతున్నాడు. రోజులాగే సోమవారం పనులు చేస్తుండగా ప్రమాదవశాత్తు జారి కిందపడి అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడి భార్య గుంజి మల్లీశ్వరి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. మృతుడికి భార్య, 4 సంవత్సరాల పాప, సంవత్సరం బాబు ఉన్నాడు.

ఆలేరు మున్సిపాలిటీ అభివృద్ధికి కృషి : చైర్మన్ శంకరయ్య

11వ వార్డులో సీసీ రోడ్డు నిర్మాణ పనులను పరిశీలిస్తున్న మున్సిపల్ చైర్మన్ శంకరయ్య

ఆలేరు రూరల్, జూలై 8 : మున్సిపల్ అభివృద్ధే ధ్యేయంగా పని చేస్తున్నానని ఆలేరు మున్సిపల్ చైర్మన్ వస్పరి శంకరయ్య అన్నారు. పట్టణంలోని 11వ వార్డులో సీసీరోడ్డు నిర్మాణ పనులను సోమవారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. వార్డుల్లో ఉన్న సమస్యలను తన దృష్టికి తీసుకొచ్చి పరిష్కరించుకోవాలన్నారు. సీజనల్ వ్యాధుల పట్ల ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కౌన్సిలర్ జూకంటి శ్రీకాంత్, కమిషనర్ లక్ష్మి పాల్గొన్నారు.

వివేకానంద జీవిత చరిత్ర పుస్తకాల పంపిణీ

విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ చేస్తున్న యజ్ఞ ఫౌండేషన్ సభ్యులు

రామన్నపేట, జూలై 8 : మండలంలోని మునిపంపుల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు యజ్ఞ ఫౌండేషన్ ఆధ్వర్యంలో వివేకానంద జీవితం – సందేశం పుస్తకాలను సోమవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఫౌండేషన్ అధ్యక్షుడు పాలెం వెంకటేశ్ మాట్లాడుతూ ప్రతి విద్యార్థి స్వామి వివేకానందను ఆదర్శంగా తీసుకొని ఉన్నతమైన లక్ష్యాన్ని సాధించుకోవాలన్నారు.

కార్యక్రమంలో యాట మహేందర్, హరినాథ్, ఉదయ్‌కిరణ్, భూమిక, ప్రధానోపాధ్యాయుడు స్వామి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

జూలూరు గ్రామంలో రోడ్డుపై బైఠాయించి ధర్నా చేస్తున్న గ్రామస్తులు

రోడ్డు నిర్మాణం చేపట్టాలని గ్రామస్తుల ధర్నా

భూదాన్ పోచంపల్లి, జూలై 8 : మండలంలోని జూలూరు నుంచి పెద్దగూడెం పిల్లాయిపల్లి వరకు రోడ్డు నిర్మాణం చేపట్టాలని ఆయా గ్రామాల ప్రజలు జూలూరు గ్రామంలో సోమవారం ధర్నా నిర్వహించారు. జూలూరు, అలీనగర్, పెద్దగూడెం గ్రామాలకు చెందిన సుమారు 200 మంది రెండు గంటలపాటు ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ గ్రామాలకు వెళ్లే రోడ్డు గుంతలమయంగా అధ్వానంగా మారిందన్నారు. ఈ విషయంపై పలుమార్లు ప్రజాప్రతినిధులకు విన్నవించినా పట్టించుకోలేదని విమర్శించారు. గత ఎమ్మెల్యే మూడు కోట్ల రూపాయలు మంజూరు చేసినా కాంట్రాక్టర్ పనిచేయడం లేదని, గతంలో పనిచేసిన వాటికి డబ్బులు చెల్లిస్తేనే చేస్తానని నిర్లక్ష్యం వహిస్తున్నారని అన్నారు. స్థానిక ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లినా స్పందించడం లేదని పేర్కొన్నారు. రోడ్డు అధ్వాన్నంగా మారడంతో గ్రామస్తులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, సమస్యను పరిష్కరించేవరకు ఆందోళన విరమించబోమని భీష్మించారు. సమస్యను ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తానని ఎంపీడీఓ రాపర్తి భాస్కర్ హామీ ఇచ్చారు. దాంతో ఆందోళన విరమించారు. కార్యక్రమంలో పెద్దగూడెం మాజీ సర్పంచులు మన్నె పద్మారెడ్డి, కాసుల బాలరాజు, నాయకులు దాసరి దశరథరెడ్డి, మన్నె రవీందర్‌రెడ్డి, ఎండీ మక్బుల్, మన్నె కృష్ణారెడ్డి, ఊదరి ప్రశాంత్, గ్రామస్తులు పాల్గొన్నారు.

'చిరు వ్యాపారుల వద్ద కాంగ్రెస్ నాయకుల వసూలు'

యాదగిరిగుట్ట, జూలై 8 : పట్టణంలో రహదారికి ఇరువైపులా అక్రమంగా షెడ్లను ఏర్పాటు చేసి చిరు వ్యాపారుల వద్ద కాంగ్రెస్ పార్టీ నాయకులు వసూళ్లకు పాల్పడుతున్నారని బీఆర్ఎస్ పార్టీ సెక్రటరీ జనరల్ పాపట్ల నరహరి అన్నారు. తెలంగాణ తల్లి విగ్రహం ఎదురుగా అక్రమ షెడ్ల ఏర్పాటును అడ్డుకున్న వారిపై కాంగ్రెస్ నాయకుల ప్రోద్బలంతో పోలీసులు థర్డ్ డిగ్రీ ప్రయోగించి చిత్రహింసలకు గురి చేశారని పేర్కొన్నారు. యాదగిరిగుట్ట పట్టణంలో సోమవారం మీడియాతో ఆయన మాట్లాడారు. అక్రమంగా తోపుడు బండ్లను ఏర్పాటు చేసి ఒక్కొక్కరి వద్ద సుమారు రూ.50వేలు వసూలు చేసినట్లు తమ వద్ద ఆధారాలు ఉన్నాయని తెలిపారు. తాము వసూళ్లకు పాల్పడలేదని స్వామివారి పాదాల వద్ద ప్రమాణం చేసేందుకు సిద్ధమా? అని సవాల్ విసిరారు. సమావేశంలో బీఆర్ఎస్ నాయకులు ఆరె శ్రీధర్ గౌడ్, యూత్ పట్టణ అధ్యక్షుడు ముఖ్యర్ల సతీశ్ యాదవ్, గడ్డం చంద్రం, గ్యాదపాక క్రాంతి పాల్గొన్నారు.

వన మహోత్సవానికి మొక్కలను సిద్ధం చేయాలి : ఎంపీడీఓ

సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ నిరంజన్ వలీ

ఆత్మకూరు(ఎం), జూలై 8 : ప్రభుత్వం త్వరలో చేపట్టనున్న వన మహోత్సవం కోసం మొక్కలను సిద్ధంగా ఉంచాలని ఎంపీడీఓ నిరంజన్ వలీ అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, ఉపాధి హామీ సిబ్బందితో సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రతి గ్రామంలో మొక్కలు నాటేందుకు గుంతలు తీసి సిద్ధంగా ఉంచాలన్నారు. సీజనల్ వ్యాధులు వ్యాపించకుండా ఉండేందుకు గ్రామాలను పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు. సమావేశంలో ఎంపీఓ పద్మావతి, ఏపీఓ రమేశ్ పాల్గొన్నారు.

ఎంపీటీసీ మర్రి వసంత సేవలు వెలకట్టలేనివి : సీపీఎం

ఎంపీటీసీ వసంతను సన్మానిస్తున్న సీపీఎం నాయకులు

సంస్థాన్ నారాయణపురం, జూలై 8 : మండలంలోని పుట్టపాక గ్రామ మాజీ ఎంపీటీసీ మర్రి వసంతానర్సిరెడ్డి ప్రజాప్రతినిధిగా గ్రామానికి చేసిన సేవలు వెలకట్టలేనివని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు దోనూరి నర్సిరెడ్డి అన్నారు. పుట్టపాకలోని అమరవీరుల స్మారక భవనంలో సోమవారం స్థానిక సంస్థల ప్రజాప్రతినిధుల ఆత్మీయ సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ అభివృద్ధి, ప్రజా సేవలో సీపీఎం ప్రజాప్రతినిధులు ఇతరులకు ఆదర్శంగా నిలిచారన్నారు. మాజీ ఎంపీటీసీ మర్రి వసంత తన గౌరవ వేతనాన్ని ప్రభుత్వ పాఠశాలలో విద్యా వలంటీర్‌కు అందించి సర్కారు బడి అభివృద్ధికి పాటుపడ్డారని తెలిపారు. అనంతరం మాజీ ఎంపీటీసీ వసంత, మాజీ ఉప సర్పంచ్ వర్కల చంద్రశేఖర్, వార్డు సభ్యులను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో దొంతగాని పెద్దులు, పిట్టల రామచంద్రం, నాగమణి, శ్రీకాంత్, గాలయ్య, లాలయ్య, అమరేందర్, యాదవరెడ్డి పాల్గొన్నారు.

అంగన్‌వాడీలకు రిటైర్మెంట్ బెనిఫిట్స్ పెంచాలి : సిఐటీయూ

దీక్షలో మాట్లాడుతున్న సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు దాసరి పాండు

భువనగిరి కలెక్టరేట్, జూలై 8 : అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలకు రిటైర్మెంట్ బెనిఫిట్స్ పెంచాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు దాసరి పాండు ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు సీఐటీయూ ఆధ్వర్యంలో కలెక్టరేట్ వద్ద సోమవారం చేపట్టిన రిలే నిరాహార దీక్షలో ఆయన మాట్లాడారు. అంగన్‌వాడీ టీచర్లు, ఆయాల పట్ల కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయన్నారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా వారికి వేతనాలు పెంచాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్స్, వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి చిలువేరు రమాకుమారి, నాయకులు ఎల్లమ్మ, ఉపేంద్ర, సునీత, లక్ష్మీబాయి, స్వరూప పాల్గొన్నారు.

రైతు భరోసా సకాలంలో ఇవ్వాలి : ఏఐకేఎంఎస్

విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఏఐకేఎంఎస్ జిల్లా అధ్యక్షుడు రాజయ్య

ఆలేరు రూరల్, జూలై 8 : ఎన్నికల్లో ఇచ్చిన వాగ్దానం మేరకు రైతులకు రూ.2లక్షల రుణమాఫీ చేసి, సకాలంలో రైతు భరోసా ఇవ్వాలని అఖిల భారత రైతుకూలీ సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు చిర్రబోయిన రాజయ్య, బెజడి కుమార్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆలేరులో సోమవారం విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ ప్రభుత్వ హామీలు మాటలకే పరిమితం అవుతున్నాయి తప్ప.. ఆచరణలో అమలు కావడం లేదన్నారు. కార్యక్రమంలో పిన్నపురెడ్డి రాఘవరెడ్డి, తమ్మిడి అంజయ్య, కొమురయ్య, గోపాల్‌రెడ్డి, నర్సింహారెడ్డి, బీరయ్య పాల్గొన్నారు.

హామీలు అమలు చేయాలి

రాజాపేట, జూలై 8 : ఎన్నికల్లో ఇచ్చిన ఆరు గ్యారంటీలు, హామీలను వెంటనే అమలు చేయాలని బీజేపీ కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో డిప్యూటీ తాసీల్దార్ వెంకటేశ్వర్‌రెడ్డికి సోమవారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ సకాలంలో రైతు భరోసా రూ.15వేలు, ధాన్యానికి రూ.500 బోనస్, ఫసల్ బీమా పథకాన్ని అమలు చేయాలని కోరారు. కార్యక్రమంలో బీజేపీ మండలాధ్యక్షుడు దాచేపల్లి రాజు, కిసాన్ మోర్చా మండలాధ్యక్షుడు మెండు భగవాన్‌రెడ్డి, సిద్ధులు, శ్రీనునాయక్, లక్ష్మణ్, సిద్దేశ్వర్, శేఖర్‌రెడ్డి, శ్రీనివాస్, మాధవులు, నవీన్, సురేశ్, నాగరాజు, రైతులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి స్పోర్ట్స్ స్కూల్‌కు ఆత్మకూర్ (ఎం) విద్యార్థుల ఎంపిక

శ్రీహర్ష, మోహిత్‌రత్నతో ప్రధానోపాధ్యాయుడు నర్సయ్య, ఉపాధ్యాయుడు ఐలయ్య

ఆత్మకూరు(ఎం), జూలై 8 : హైదరాబాద్ హకీంపేటలోని రాష్ట్ర స్థాయి స్పోర్ట్స్ స్కూల్‌కు మండల కేంద్రంలోని సరస్వతి విద్యాలయం విద్యార్థులు శ్రీహర్ష, మోహిత్ రత్న ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు పంజాల నర్సయ్యాగౌడ్ తెలిపారు. 2024–25 విద్యా సంవత్సరానికి గాను జూన్ 22న భువనగిరిలో జరిగిన జిల్లా స్థాయి ఎంపికలో వారు ప్రతిభ కనబరిచి రాష్ట్ర స్థాయికి ఎంపికయ్యారు. వీరు ఈ నెల 11న హకీంపేట స్పోర్ట్స్ స్కూల్‌లో జరిగే రాష్ట్ర స్థాయి ఎంపికకు హాజరు కానున్నారు. వారిని పాఠశాల కరస్పాండెంట్ తౌర్ర విష్ణు, ఉపాధ్యాయులు సోమవారం అభినందించారు.

కష్టమర్లకు మెరుగైన సేవలు అందిస్తాం

- యూనియన్ బ్యాంకు మేనేజర్ సత్తయ్య

యాదగిరిగుట్ట, జూలై 8 : బ్యాంకు ఖాతాదారులకు మెరుగైన సేవలు అందించేందుకు తమ సిబ్బంది ఎప్పుడూ అందుబాటులో ఉంటారని యూనియన్ బ్యాంకు యాదగిరిగుట్ట బ్రాంచ్ మేనేజర్ ఎం.సత్తయ్య అన్నారు. దేవస్థానం కౌంటర్‌లో పనిచేసే మెరుగు బాలకృష్ణ ఇటీవల మృతిచెందగా.. ఆయన కుటుంబానికి బ్యాంకు గ్రూప్ ఇన్సూరెన్స్ స్కీం కింద రూ.10 లక్షల ఇన్సూరెన్స్‌తోపాటు ప్రధాన మంత్రి జీవన్ సురక్ష పథకం కింద రూ.2 లక్షలు మంజూరయ్యాయి. ఆ చెక్కులను బాలకృష్ణ తల్లి మెరుగు పుష్పకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సేవింగ్ ఖాతాదారులు సంవత్సరానికి రూ.1,519 చెల్లించితే సహజ మరణానికి రూ.10 లక్షలు, ప్రధాన మంత్రి జీవన్ సురక్ష స్కీమ్ కింద ఏడాదికి రూ.436 చెల్లిస్తే సహజ మరణానికి రూ.2 లక్షల ఇన్సూరెన్స్ ఉంటుందన్నారు. కార్యక్రమంలో అసిస్టెంట్ మేనేజర్ పవన్, క్యాషియర్ సురేశ్, సిబ్బంది ఇంద్రజ, సురేశ్, పరశురాం పాల్గొన్నారు.

హద్దురాళ్లు తొలగించిన వారిపై చర్యలు తీసుకోవాలి

భూదాన్ పోచంపల్లి, జూలై 8 : మండలంలోని ఇంద్రియాల గ్రామం పరిధిలో వ్యవసాయ భూమిలో కొందరు దౌర్జన్యంగా ప్రవేశించి హద్దురాళ్లను తొలగించారని, పాలేరుపై దుర్భాషలాడి కొట్టేందుకు ప్రయత్నించారని, వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని తాసీల్దార్ శ్రీనివాస్‌రెడ్డికి సోమవారం బాధితులు చిలుముల కేశవరెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి వినతి పత్రం అందజేశారు. కొందరు తప్పుడు ప్రచారం చేస్తున్నారని, వాస్తవాలు తెలుసుకోవాలని వారు కోరారు.

ఇసుక తరలిస్తున్న వారిపై వాల్టా కేసు నమోదు చేయాలి

రాజాపేట, జూలై 8 : రాత్రి వేళ ఇసుకను అక్రమంగా తరలిస్తున్న ట్రాక్టర్లను పట్టుకొని వాల్టా చట్టం కింద కేసులు నమోదు చేయాలని పోలీసులకు తాసీల్దార్ ఆదేశాలు జారీ చేశారు. మండలంలోని బేగంపేట వాగులో నుంచి రాత్రి వేళ ఇసుక రవాణా జోరుగా సాగుతున్నదని గ్రామస్తుల నుంచి ఫిర్యాదు వస్తున్నాయని తెలిపారు. పోలీసులు గట్టి నిఘా పెట్టి ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్లను సీజ్ చేయాలని సూచించారు.